రోడ్లపై సంతలతో ఇబ్బందులు

- సౌకర్యాల కొరత
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- స్థలాల కేటాయింపుపై దృష్టి సారించాలంటున్న మండల ప్రజలు


రేమద్దులలో రోడ్డుపై సంత(ఫైల్)


పాన్‌గల్‌లో రోడ్డుపై సంత(ఫైల్)

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో జరుగుతున్న వారాంతపు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తుండటంతో వాహనదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, రేమద్దుల, శాగాపూర్‌తో పాటు మరికొన్ని గ్రామాల్లో వారాంతపు సంతలకు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు వస్తుంటారు. సంతలకు ప్రత్యేక స్థలాలు లేక చాలా వరకు ఆరుబయట, ప్రధాన రోడ్లపైనే నిర్వహిస్తుండటంతో వచ్చిపోయే వాహనాలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయాల సంతల నిర్వహణ కోసం ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తున్నా.. సంతల్లో వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవట్లేదు. ఏళ్లుగా ఆయా గ్రామాల్లో ప్రధాన రోడ్లపైనే సంతల నిర్వహణ కొనసాగుతుండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతపు సంతల నిర్వహణ రోజు ఆయా రోడ్ల ద్వారా వాహనాలు వెళ్లడం కష్టంగా మారుతుంది. వారాంతపు సంతల నిర్వహణను తైబజారు దక్కించుకున్న వారికి ఎంతో కొంత ఆదాయం లభిస్తున్నా ప్రత్యేక స్థలాల కేటాయింపు గాని, వసతుల ఏర్పాటుపై ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదని వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పంచాయతీ సభ్యులు స్పందించి వారాంతపు సంతలకు ప్రత్యేక స్థలాలు కేటాయింపుకు తగు చర్యలు తీసుకొని ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


గ్రామాల్లో వారాంతపు సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాలు కేటాయించి వసతులు ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రోడ్లపై సంతల నిర్వహణతో రాకపోకలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాలు కేటాయించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.
– మౌనికయాదవ్, మాజీ సర్పంచ్, శాగాపూర్

పంచాయతీలైనా దృష్టిసారించాలి


గ్రామాల్లో వారాంతపు సంతలకు ఆయా పంచాయతీలు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక స్థలాలు కేటాయిస్తే ఇబ్బందులు తొలుగుతాయి. ఏళ్లుగా రోడ్లపైనే కొనసాగే వారాంతపు సంతల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
– కోదండరాములు, రైతు సంఘం జిల్లా నాయకుడు, రేమద్దుల

చర్యలు తీసుకుంటాం


మండలంలో వారాంతపు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. ఈ విషయంపై ఆయా గ్రామాలను సందర్శించి ప్రత్యేక స్థలాల గుర్తింపుపై తగు చర్యలు తీసుకుంటాం. ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.
– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన



వనపర్తి రూరల్: కిషోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికలు, మహిళల రక్షణకు రూపొందించిన చట్టాలపై మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, షీ టీం ఆధ్వర్యంలో మంగళవారం పెబ్బేరు మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భద్రసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడికి సన్మానం



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో బాల చెలిమి గ్రంథాలయాలపై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆయనను సన్మానించి ప్రశంసాప్రతం అందజేశారు. బాలసాహిత్యంలో విశేష కృషి చేస్తున్నందుకు ఈ సన్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల చెలిమి రాష్ట్ర కోఆర్డినేటర్ మణికొండ వేదకుమార్ పాల్గొన్నారు.

టీజీఎస్ఎస్‌కు విద్యార్థినుల ఎంపిక



మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినులు పల్లెపాగ శ్రావ్య, అక్కల శ్రీనిజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ఎండీ ఖాజామైనోద్దీన్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అభినందించారు. జిల్లా నుంచి ఐదుగురు బాలికలు ఎంపిక కాగా.. తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఉండటం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజియాబేగం, సత్యావతమ్మ, అలివేలు, మమత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పాదపూజ



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల అవ్వ, తాతలను పాఠశాలకు రప్పించి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆయన శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనోద్దీన్, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలమ్మ, శ్రీధర్, ఇందిరమ్మ, కవిత, శివాని తదితరులు పాల్గొన్నారు.

దాతల ఆర్థిక సాయమే ఆశీర్వాదం



మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన రవి, మనీషా దంపతుల కుమార్తె గీతిక దేవి ప్యాంక్రియాస్ వ్యాధితో బాధపడుతోంది. ప్యాంక్రియాస్‌లో రాళ్లు ఉండడంతో కడుపు నొప్పి వేధిస్తోందని చిన్నారి తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం ఉండడంతో ఇప్పటికే అప్పులు చేసి చికిత్స కోసం ఖర్చు పెట్టారు. ఆపరేషన్ కోసం మరో రూ.3 లక్షలు ఖర్చు చేయాలంటే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కూతురిని కాపాడాలని వేడుకుంటున్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలి


మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు, వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకునేలా చూడటం, 108 వాహనం వినియోగం, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడంపై అవగాహన కల్పించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు తారశశాంక్, నిహారిక, సూపర్‌వైజర్లు సుమనశ్రీ, శాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, మధుబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీబీ' నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో టీబీ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు రక్తం పడటం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు శ్రీలక్ష్మి, రాంచందర్, మదన్‌గోపాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ: ఒకరి మృతి

వనపర్తి రూరల్: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం రంగాపురం శివారులోని పొగాకు కంపెనీ సమీపంలో జాతీయ రహదారి 44పై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వీపనగండ్ల మండలంలోని కల్వరాలకు చెందిన శివశంకర్ (35) బైక్‌పై పెబ్బేరు వైపు వస్తుండగా.. రంగాపురం శివారులో బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని హైవే అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు.

యువతి అదృశ్యం

కొత్తకోట రూరల్: అమడబాకులకు చెందిన గొండ్ల రామన్‌గౌడ్ చిన్న కుమార్తె అశ్విని స్టాఫ్ నర్స్ పూర్తి చేసింది. సెప్టెంబర్ 17న పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లగా.. అశ్విని ఇంటి వద్ద ఉంది. తల్లిదండ్రులు పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి రాగా అశ్విని కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గ్రామానికి చెందిన గొల్ల శివ మాయమాటలు చెప్పి తన కూతురుని తీసుకెళ్లినట్లు పోలీస్‌స్టేషన్‌లో రామన్‌గౌడ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

శివాలయానికి మైక్‌సెట్ వితరణ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయానికి రూ.35 వేల విలువ చేసే మైక్‌సెట్‌తో పాటు భజన బృందం సభ్యులకు అవసరమైన వస్తువులను ఆగారం ప్రకాష్, లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆలయం వద్ద ప్రతిరోజు ఉదయం, సాయంత్రం భక్తిగీతాలు మైక్‌సెట్ ద్వారా వినిపించడంతో ప్రజలకు మానసిక ప్రశాతంత ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రతి రోజు ఆలయంలో భజన చేయడం వలన ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఏర్పడుతుందన్నారు. అందుకే వారు అడిగిన వెంటనే ఆగారం ప్రకాష్ రూ.25 వేలు, లక్ష్మారెడ్డి రూ.10 వేలు అందించామన్నారు. ఈ సదర్భంగా దేవాలయ కమిటీవారు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలింగం, రాంగోపాల్‌రెడ్డి, పాలిశెట్టి శ్రీను, కాగితాల మధు, బండారి యాదరిగి, లింగస్వామి, రాజేందర్‌గౌడు, పొయ్యికాటి చెన్నయ్య, గిరి, వెంకటేష్, శ్రీశైలం, మంజుల, గీత పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల అభ్యున్నతికి కృషి



వనపర్తి: జిల్లా ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వనపర్తికి చెందిన సీనియర్ ఎలక్ట్రీషియన్ గోవర్ధన్‌సాగర్ ఎన్నికయ్యారు. పద్నాలుగేళ్ల తర్వాత తొలిసారి అధ్యక్ష పదవి కోసం ఇద్దరు పోటీ పడగా.. సమీప అభ్యర్థి నాగరాజుపై గోవర్ధన్ సాగర్ 20 ఓట్ల తేడాతో గెలుపొందారు. జిల్లాలోని ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ పని చేసే కార్మికుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు తెలిపారు.


పెద్దగూడెం పాఠశాలలో..


వీపనగండ్ల ఎమ్మార్సీ పాఠశాలలో


ఖిల్లాఘనపురంలో..


గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో..

ఘనంగా బతుకమ్మ సంబురాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి దసరా పండుగ సెలవులను ప్రభుత్వం ప్రకటించడంతో ముందస్తుగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. బతుకమ్మల చుట్టూ విద్యార్థులు కోలాటాలు, బొడ్డెమ్మలు కొడుతూ ఆనందంగా గడిపారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు.


ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడ పాఠశాల ఆవరణలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు


ఆత్మకూర్‌లో..


అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

'ఉపాధి' పనులపై నిర్లక్ష్యం వద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధి హామీ పనుల పురోగతిపై ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి అడిగిన వెంటనే పని కల్పించడంతో పాటు చేసిన పనికి డబ్బులు సకాలంలో అందించాలన్నారు. క్రమం తప్పకుండా ఉదయం, మధ్యాహ్న సమయాల్లో పనిచేసిన కూలీల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధి పనులు గతేడాది ఎంత వరకు నిర్వహించారో అన్న విషయాలపై త్వరలోనే సోషల్ ఆడిట్ జరుగుతుందని, వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్‌లో కరెంటు కోతల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు వెంటనే తోమాలపల్లి సబ్‌స్టేషన్ ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు వెంకటన్నగౌడ్, సందకేశవ్, పరమేష్‌నాయి మంగళవారం తహసీల్దార్ లక్ష్మి, ఏఈకి వారి వారి కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తోమాలపల్లి సబ్‌స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేసి రాంపురం, శాఖాపూర్, రామమ్మపేట, గ్రామాల్లో కరెంటు సమస్యలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో గువ్వల గోపి, మరాటి రాకేష్, వడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు, ఓనర్ల కమిటీ ఎన్నిక


ఆటో యూనియన్ కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకులు

అమరచింత: మండల ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ నూతన కమిటీని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ తెలిపారు. మండల నూతన అధ్యక్షుడిగా నిస్సార్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా రఘు, సహాయ కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా వెంకి, సభ్యులుగా ఖతాల్, రాజుతో పాటు 9 మందితో ఏకగ్రీవంగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ పరంగా చెల్లిస్తామన్న రూ.12 వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి


మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: పల్లె బృహత్‌ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ సమీపంలో ఏర్పాటు చేసిన వన సంపద వనాలను ఆయన మంగళవారం సందర్శించి, మొక్కలకు నీరు పట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలతో పాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీటిని అందిచాలన్నారు. మొక్కల పెంపకంపై అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

'అమ్మ కోసం ఒక మొక్క'

వనపర్తి రూరల్: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'అమ్మ కోసం ఒక మొక్క' కార్యక్రమాన్ని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పెబ్బేరు మండలంలోని యాపర్ల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో పచ్చదనం పెంచే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల విద్యార్థి వెంకట కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకొని తల్లిదండ్రులు సంధ్య, రామకృష్ణుడు సమక్షంలో మొక్క నాటినట్లు హెచ్‌ఎం హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం


పాన్‌గల్‌లో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూర్: ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా, పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీరు ఉంచొద్దు

పాన్‌గల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండొచ్చని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోసి నూతన నీటిని పట్టుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికులకు ప్రత్యేక శిక్షణ


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌కుమార్

పాన్‌గల్: గ్రామస్థాయిలో తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపేందుకు పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమిత్, ఏఈ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ సమావేశంలో వారు మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా సహాయకులకు గ్రామాల్లో తలెత్తే చిన్న చిన్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. బోరుమోటారు, చేతిపంపులు, పైపులైన్ల లీకేజీల మరమ్మతు, నీటి నాణ్యత పరీక్షలు, ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ సక్రమంగా ఉండేలా చూసుకోవడం తదితర అంశాల గురించి అవగాహన కల్పించామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు, ల్యాబ్ సిబ్బంది, పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తాగునీటి సరఫరా సహాయకులకు డీపీఓ సురేష్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్‌లో మొత్తం 35 గ్రామ సహాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈ జైపాల్ రెడ్డి, ఎంపీడీఓ శంకర్, మొగులయ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్: మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో తాగునీటిని అందించడమే లక్ష్యంగా పంచాయతీ కార్మికులు ముందుకెళ్లాలని మిషన్‌భగీరథ డీఈ రామసుబ్బారావ్, ఏఈ రుక్మేందర్‌రెడ్డి, ఎంపీడీఓలు సుజాత, శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో అమరచింత, ఆత్మకూర్ మండలాల కార్మికులకు నీటిసరఫరాపై అవగాహన కల్పించారు.

హైదరాబాద్ జిల్లా టాపర్‌గా తెల్లరాళ్లపల్లి వాసి


ముంత భాస్కర్

పాన్‌గల్: ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన ముంత భాస్కర్ ఎస్జీటీలో హైదరాబాద్ జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు. 87.47 మార్కులతో తెలుగు మాధ్యమంలో ప్రథమ, ఆంగ్ల మాధ్యమంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తల్లి నాగలక్ష్మి టైలర్‌గా, తండ్రి నర్సింహ వ్యవసాయం చేస్తుంటారు. మొదటి ప్రయత్నంలోనే భాస్కర్ ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల సహకారం, ప్రణాళికబద్ధంగా చదవడంతో ర్యాంకు సాధ్యమైనట్లు భాస్కర్ పేర్కొన్నారు.